# గ్రేట్ ఎస్కేప్

## మధు చక్రవర్తి

నిద్ర... నిద్ర...

మనిషికి మరపునిచ్చే నిద్ర...

మనసును సేద తీర్చే నిద్ర...

నిద్ర... నిద్ర...

గుడిలాంటి.. అమ్మ వొడిలాంటి నిద్ర... నిద్ర...

రాదేం... రాదేం...

అర్ధరాత్రి దాటినా ఈ కంటికి నిద్ర...

రాదేం... రాదేం....

ఈ రెప్పలు మూతలు పడవేం... పడవేం...

అమ్మా... అమ్మా.. ఓ నిద్రదేవతా... రామ్మా... రా.. రా..

నీ.. ఒడిలో ఒకింత సేద తీర్చుకోనివమ్మా.. తీర్చుకోనివ్వు..

అబ్బబ్బ... కనులు మూస్తే కలలు... కలలు...

కలల అలలు... అలల్లా కలలు...

నిద్దరాని ఈ రాత్రి నరకం... నరకం..

ఎవరూ... ఎవరూ... ఎవరదీ...

తన పక్కన.. తన పక్కలో... ఎవరూ.. ఎవరదీ..

మనిషా.. శవమా...

శవంలాటి మనిషా...

మరి.. మనిషైతే కండ ఉండాలిగా...

తిండి తింటే కండకలదోయ్...

కండ కలవాడే మనిషోయ్... మనిషోయ్..

అయితే అస్తిపంజరంలా ఏమిటీ ఎముకల స్పర్శ..

ఆ.. దొరికిందోయ్... దొరికింది..

కండ దొరికిందోయ్... దొరికింది...

యిదిగో... యిదిగో... యిదిగిదిగిదిగో...

ఎండిన గుండెలపై అర్చుకుపోయిన తిత్తులు... తోలు తిత్తులు...

ఏమిటవి.... ఏమిటవి...

రొమ్ములు... రొమ్ములు... ఆడదాని రొమ్ములు... రొమ్ములు

అల్లసాని పెద్దన్న మంచి ఆత్రేయవరకూ అదేపనిగా వర్ణించిన...

ఆడదాని రొమ్ములు... రొమ్ములు...

తన పక్కన.. తన పక్కలో.. ఆడదా.. ఆడదా..,

ఎవరా ఆడది... ఎవరెవరా ఆడది...

ఓహ్.. ఎవరా ఎవరేంటి... పెళ్ళాం.. తన పెళ్ళాం...

చాలాకాలంగా తను మర్చిపోయిన తనువార్చుకుపోయిన పెళ్ళాం... తన పెళ్ళాం...

తీర్చని కట్నం డబ్బుకోసం ఆరేళ్ళుగా అత్తమామల్తో... ఆడపడుచుల్తో

అవిరామంగా పీడించబడుతున్న పెళ్ళాం... తన పెళ్ళాం..

మూడేళ్ళుగా ముదిరినా ముదనష్టపు 'టి.బి' జబ్బుతో పీడించబడుతున్న... పెళ్ళాం... తన పెళ్ళాం..

ముగ్గురి పిల్లల ఉత్పత్తితో ఉత్త మునలి తిత్తయిపోయిన పెళ్ళాం... తన పెళ్ళాం...

ఏమైతేనేం ఎలా వుంటేనేం పెళ్ళాం... తన పెళ్ళాం...

అగ్నిసాక్షిగా అందరిముందు తాళికట్టిన పెళ్ళాం.. తన పెళ్ళాం..

అందగత్తయినా అనాకారయినా పెళ్ళాం.. తన పెళ్ళాం.

కానీ ఖర్చులేని కాలక్షేపం.. కామనిక్షేపం.. కానీవోయ్.. కానీయ్...

దంతక్షతాలు.. నఖక్షతాలు... కామకేంద్రాలు.. కళాస్థానాలు...

ఓహ్... జాయ్... జాయ్... ఎంజాయ్... ఎంజాయ్

ఉఫ్ ముట్టుకున్నా పట్టుకున్నా చుంబించినా చప్పరించినా

ఉలకదేం.. పలకదేం.. స్పందన స్తంభన కలగదేం... కలగదేం...

వాత్స్యాయనుడా.. యూ ఆర్ రాంగ్ నాయనా... రాంగ్

నీ థియరీ తప్పయ్యా.. తప్పు... తప్పు.. తప్పుతప్పు...,

లేదోయ్ లేదు.. నాదేనోయ్ లోపం.. నాలోనే ఉంది లోపం...

యూ.. సమ్‌థింగ్ రాంగ్ విత్‌మీ ఓన్లీ.. అవును... అవునవును...

నరాల బలహీనత.. నపుంసకత్వం... అంగంచిన్నదగుటు సంప్రదించండి.. డాక్టర్ రావ్... బియ్యే..బేచులర్ ఆఫ్ ఆర్ట్స్..

డాక్టర్!.. బేచులర్ ఆఫ్ ఆర్ట్స్!! సెక్స్ స్పెషలిస్ట్!!!

కల్సుకోవాలి.. కల్సుకోవాలి.. నో..నో...నోనోనో... క్వాక్స్... క్వాక్స్

మరైతే మరైతే.. శవం... శవం

అవును.. అవును... శవం స్పదించదు... స్పందిచదు

సారీ వాత్స్యాయనా నిన్ను నిందించాను నాయనా...

వద్దయ్యా.. వద్దు శవ సంభోగం వద్దయ్యా వద్దువద్దు..

కావాలి.. కావాలి... నిద్ర.. రావాలి.. రావాలి నిద్ర..

అస్థిమితం.. అస్థిమితం...

అదిగదిగో. అరుపు.. అరుపు.. కొక్కొరోకో.. కోడిపుంజు అరుపు.. అరుపు

అల్లదిగో.. ఎరుపు... ఎరుపు...తూరుపు దిక్కున మారీదు ఎరపు.. ఎరుపు...

* * *

అరుపులు... అరుపులు

కుక్క అరుపుల్లా... కుక్క కరుపుల్లా.. తల్లి అరుపులు... అరుపులు...

కుక్కిన పేనులా నోట్లో కొంగుకుక్కుకుని, వంటింట్లో నక్కిన పెళ్ళాం...

నిట్టూర్పులు... నిట్టూర్పులు... ఈ మూల ఖాళీ అమూల్‌డబ్బా పట్టుకుని వంచాడి ఏడుపులు... ఏడుపులు.. ఆ మూల... మూలపడ్డ మూలవ్యాధి ముసలితండ్రి మూలుగులు.. మూలుగులు...

అదిగో.. పెళ్ళికాని వయసుముదిరిన చెల్లెళ్ళ చవకబారు సినిమాకబుర్లు.. కబుర్లు.. మారాలి.. మారాలి...

ఈ మనుషులు మారాలి.. మారాలి ఈ మనస్తత్వాలు మారాలి.. మారాలి.. జీవితాలు మారాలి.. జీతాలు రావాలి...

జీతాలు... ఆఫీసు.. ఆఫీస్వర్యుడు.. కోపీశ్వరుడు...

అమ్మో.... అమ్మో.. ఆలస్యం... ఆలస్యం...

పోవాలి.... పోవాలి.... ఆఫీసుకి పోవాలి... పోవాలి...

అయిందా అయిందా కేరేజీ అయిందయిందా

లేదు... లేదు... లేద్లేదు.. పప్పుల్లేవ్... ఉప్పుల్లేవ్.. వంటింట్లో వెచ్చాల్లేవ్...

లేవ్... లేవ్... నరకం.... నరకం...

పోవాలి... పోవాలి... నరకంలోంచి పోవాలి.... పారిపోవాలి...

ఎస్కేప్...ఎస్కేప్... క్విక్... క్విక్...

* * *

గుంపులో గుంపులుగా జనం... జనం.. జనం

హత్యా... హర్తాళా.... సింహళకాంధిసీకులా.. యుద్ధశరణార్థులా...

ఎవరూ... ఎవరూ వారెవరూ... ఎవరూ.

అహ్హాహ్హా... శరణార్థులు... శరణార్థులు... బస్సు శరణార్థులు... బస్సే శరణం గచ్ఛామి...

రావే... రావే.. ఆర్టీసీ బస్సు రావే... రావే... రావే.. మా సిటీ బస్సు...

ఆరాటం.. ఆరాటం మరో అరక్షణంలో అమెరికా అణుబాంబు ప్రయోగిస్తుందని తెలిసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుపారిపోతున్నట్టు...

---

**జబ్బలజాకెట్టు... దబ్బపండు జబ్బలు... తడిసిన చంకలు... బాహుమూలాల రుచులు... రుచులు... స్వర్గం...స్వర్గం... ఓహో... హోలుడా టేస్టంటే నీదే నోయ్... నీదే... మురికివాడలో... ఇరుకు గదిలో...**

ఆరాటం... ఆరాటం... ఒకటే ఆరాటం...

అబ్బ... రాదేం.. రాదేం... బస్సు... రాదేం... రాదేం...

వేస్తం.. మవ్వెక్కాల్సిన బస్సు ఓ జీవితకాలం లేటోయ్.. లేటు..

లేటా... లేటా.. లేట్లేటా.... బాబోయ్.. బాబోయ్..

తోపులాట... తొక్కిసలాట...

దిగండి.. దిగండి దిగండమ్మా దిగండి దిగండయ్యా దిగండి...

తప్పుకోండి... తప్పుకోండి... తప్పుకొండ్తప్పుకొండి...

శాంతి... శాంతి... శాంతి... బుద్ధం శరణం గచ్ఛామి...

ఆరాటం... ఆరాటం... జీవన పోరాటం...పోరాటం...

ధైర్యే సాహసే బస్సే స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ డార్విన్ యూ ఆర్ రైట్ రైటో రైట్ రైట్... రైట్... పోయింది... పోయింది...



ఆఫీసు.. ఆఫీస్వరుడు.. కోపీశ్వరుడు.. చివాట్లు.. చార్జిషీట్లు...

సీఆర్లు.. రెడ్‌మార్కులు... బాబోయ్... బాబోయ్..

హుర్రె... హుర్రె..హిప్..హిప్ హుర్రే..హుర్రే..

కేకలు.. కేరింతలు... గెంతులు...

ఆనందం... ఆవేశం...ఆరాటం..

ఏమైంది ఏమైంది...ఏమైందేమైంది...

ఇండియాకి ఆర్థికస్వాతంత్ర్యం వచ్చిందా?యన్టీఆర్‌కి ప్రధాని పదవొచ్చిందా? కాదండి..కాదు బస్సండి ఆర్టీసీ బస్సండి... వచ్చిందోయ్ వచ్చింది.. బస్సు వచ్చిందోయ్ వచ్చింది..

ఎక్కండి... ఎక్కండి... ఎక్కెండెక్కండి...

ముందు ఆడ.. వెనుక మగ..

వెనక మగ... ముందు ఆడ...

ఆడ...మగ..మగ..ఆడ...

అబ్బా అమ్మా.. బాబోయ్...వాయువోయ్

కాళ్ళు తొక్కకండి... కళ్ళు పొడవకండి..డొక్కలో గుద్దకండి...

ఆపండి... ఆపండి... బస్సాపండాపండి..

ఎందుకూ... ఎందుకూ... ఎందుకెందుకూ..

జోడండి... జోడు... కాలిజోడండి.. జోడు

లాభంలేదు... లాభంలేదు...పోనీయ్... పోనీయ్..

జోడుపోతే పోనీ... పోనీ... పోనీ... బస్సు ముందుకు పోనీ పోనీ

ఉరుకులు.. పరుగులు... ఛురుగులు..ఉరుకులు..

హమ్మయ్యా... దొరికిందోయ్...దొరికింది... ఫుట్‌బోర్డు..

దొరికిందోయ్.. దొరికింది...యికా ఆఫీసు..ఆఫీస్వరుడు

కోపీశ్వరుడు..పర్లేదు...పర్లేదు..పర్లేదోయ్.. పర్లేదు..

స్క్వాడ్... స్క్వాడ్... మొబైల్ స్క్వాడ్... స్క్వాడ్..

పరమపదసోపానం చేరేలోగా పాములు... పాములు

ఎన్నెన్నో పాములు.. పాములు..

పదండి... ప దండి... ఫుట్ బోర్డుమీంచి లోనికి పదండి... పదండి...

పదండి ముందుకు.. పదండిలోలోకి

ఏయ్ ఆగు ఆగాగు.. దిగు..దిగుదిగు పద.. పద... పదపద

ఎందుకు... ఎందుకు...ఎందుకెందుకు

హేంగింగ్... హేంగింగు పాసింజరువి...

అందుకు... అందుకు... అందుకందుకు

హేంగింగా హేంగింగేకదా... హైజాకింగ్ కాదుగా కాదుకాదుగా..

మాట్లాడకు.. మాట్లాడకు.. మాట్లాడితే హేంగ్ చేస్తాం...

పద.. పద... పదవోయ్ పదపద..

ఏం చేస్తారు... ఏం చేస్తారు... ఏం చేస్తారేంచేస్తారు..

ఫైవోయ్.. ఫైను.. ఫైనేస్తాం.. మాట్లాడితే బొక్కలో తోస్తాం... తోస్తాం..

ఫైవా.. ఫైవా.. ఎంత.. ఎంత... ఎంతెంత..

పదోయ్.. పది.. పదిపది..

అమ్మో పదే.. లేదు... లేదు.. లేద్లేదు..

అయితే పద జైలుకి... పదపద...

జైలే బాబాయ్... వద్దు... వద్దు... వద్దొద్దు..

యిందా... యిందా.. యిందిందా..

* * *

వచ్చాడు.. వచ్చాడు. వచ్చాడొచ్చాడు... ఆలస్య కుమారు డొచ్చాడొచ్చాడు..

రా బాబూ రా నాయనా రామ్మా.. రా..రా..

ఈ రోజాలస్యానికి చెప్పబోయే కాశీమజిలీ కథేమిటి నాయనా...

మీ ఆవిడ ఒంట్లో బాలేదా..

యింట్లోకి రాకూడదా..

మవ్వెక్కిన బస్సు హైజాకయిందా..

రాత్రి జానీవాకర్ హేంగోవరిచ్చిందా..

కొంపదీసి ఏ విదేశీ హస్త ప్రమేయమైనా వుందా..

చెప్పమ్మా... చెప్పు... చెప్పెప్పు...

కొలీగ్స్ కూతలు.. కాకిమూక కేకలు.. కాకి ముక్కు పోటులు..

కేనిబాల్స్ కేనిబాల్స్.. సాటి మనిషిని సజీవంగా తినే కేనిబాల్స్..

ఫాక్సెస్ ఫాక్సెస్ కుళ్ళిన మాంసం ఆనందంగా ఆరగించే కన్నింగ్ ఫాక్సెస్... నరకం.. నకరం..

బాబుగోరూ... ఆఫీసరుగోరు రమ్మంటన్రమ.. ప్యూనుగాడి పిల్లిచూపులు

ఆఫీస్వరుడు... కోపీశ్వరుడు..

మరణం.. మరణం.. మనసు మరణం.. మనిషిగా మరణం..

మరణం.. మరణం.. వ్యక్తిత్వం మరణం.. వ్యక్తిగా మరణం

ఏంవోయ్ నీకు సిగ్గుందా పీముందా..నెత్తురుందా..

ఛీ..ఛీ..ఛీ.. ఛీఛీఛీ నీ యింక్రిమెంటు కట్..

యిదిగో ఈ బిల్లు ముందులెక్కకట్టు ఫో...ఫో... ఫోఫో..

పునరపి జననం.. పునరపి మరణం..

జననం.. మరణం.. మరణం.. జననం..

గుడ్‌మార్నింగ్ స...

గుడ్‌మార్నింగా... తనకా... సర్.. రా.. తన్నా..

ఎవరూ... ఎవరూ... ఎవరెవరూ...

డైజీ .. మిస్ డైజీ స్టెనో డైజీ స్టన్నింగ్ డైజీ...

తన్నుకాదు... ఆఫీస్వరుడ్ని..

హలో డయిజీ మార్నింగ్ మార్నింగ్.. వెరీవెరీ గుడ్‌మార్నింగ్..

కమ్.. సిట్.. ఎనీ బస్ ప్రాబ్లెమ్...

యా..సా

యూస్‌లెస్ ఆర్టీసీ ఆర్యూ టైర్‌డ్ కమ్. కమ్ రిలాక్స్..రిలాక్స్..,

ఆఫీస్వరుడు కోపీశ్వరుడు లేటుగా వచ్చిందని కోప్పడడేం..

పైపెచ్చు రికాలక్సంటాడేం... రిలాక్స్..క్స్..క్స్..క్స్.. సెక్స్.. సెక్స్..

అయింది... అయింది అర్థమైందర్థమైంది...



ఎన్నేళ్ళు

"1947లో పుట్టిన మనిషికి ఇప్పుడెన్నేళ్ళు ఉంటాయిరా?" అడిగారు మాష్టారు.

"అబ్బాయికా... అమ్మాయికా... మాష్టారూ?" సందేహం వ్యక్తం చేశాడు బాబి.

—జోకర్ (హైద్రాబాద్)

రొమ్ములు... పిర్రలు... పిర్రలు.. రొమ్ములు...

ఒరే బ్రహ్మ.. ఒరోరే బ్రహ్మ..హేట్సాఫ్‌రా.. నీకు హేట్సాఫ్...

ఏం గురూ... ఎందుకు పిల్చాట్ట...

ప్రమోషనా..

డబుల్ యింక్రిమెంటా..

మొహం చూస్తే తెలీటంలేదు..

కాకులు.. కాకులు.. బాకులు.. బాకులు..

నరకం.. నరకం..

సుబ్రావ్‌గారూ... సుబ్రావ్‌గారూ... ఆఫీసర్ చెప్పిన బిల్లు అయిందా.. పూర్తయిందా..

పరిమళం.. చార్లీ పరిమళం... వయసులో వున్న ఆడదాని యవ్వన పరిమళం... డైజీ... డైజీ... ప్యారడైజ్... జీ...

బ్యూటీ... బ్యూటీ... ఎరోటిక్... బ్యూటీ...

ఏం తింటుంది... ఏం తింటుంది..ఎలా పెంచింది ఎలా పెంచింది అంతలేసి రొమ్ములు... అమోఘమైన రొమ్ములు..

ఇంతలేసి పిర్రలు... యిసుక పర్రల్లాంటి పిర్రలు

గ్రోమోర్.. జెర్సీపాడి ఆవు.. డైరీ పాల పేకెట్లు..

ముట్టుకుంటే పట్టుకుంటే వాటేసుకుంటే..

స్వర్గం... స్వర్గం... పేరడైజ్... పేరడైజ్..


జబ్బల జాకెట్టు... దబ్బపండు జబ్బలు.. తడిసిన వంకలు..

బహుమూల రుచులు... రుచులు.. స్వర్గం...స్వర్గం...

ఓహో.. హోలుడా చేస్తుంటే నీదేవోయ్..నీదే..

మురికివాడలో యిరుకుగదిలో... చమటకంపులో..

మాసిన మకిలి దుప్పటి మంచంపై అగ్నిసాక్షిగా పొందిన రోగిష్టి అర్థాంగి మనసులో నగ్నంగా సాక్షాత్కరించే డైజీ అంగాలు... చలనాలు... స్ఖలనాలు.. జీవితం...



జీవితం
రొటీన్..రొటీన్... కృత్రిమం... కృత్రిమం.. నరకం..నరకం...
హలో మ్రబావ్‌గారూ... మిమ్మల్లే... మిమ్మల్నే...
డైజీ... డైజీ... ఏవన్నారు... ఏవన్నారు... ఏవన్నారేవన్నారు...
బిల్లండి బిల్లు... బిల్లు బిల్లు
చేస్తున్నా... చేస్తున్నా... చేసేస్తున్నా..
సెకన్లు.. నిముషాలు... గంటలు...
హమ్మయ్యా... అయ్యిందయ్యింది... బిల్ అయ్యిందయ్యింది...
ఇక యివ్వాలి.. యివ్వాలి... డైజీకివ్వాలివ్వాలి...
అప్పుడు... మూడాలి... మూడాలి.. డైజీ రొమ్ములు.. తడి వంకలు..
డైజీ... డైజీ... యిదిగో బిల్లు... యిదిగిదిగో బిల్లు...
ఐసీ... ఐసీ... నైస్ నైస్... టేక్‌దిస్... టేక్‌దిస్...
ఏవిటేది... ఏవిటేది... ఏవిటేవిటేది..
సారీ..సారీ.. చార్జిషీటు... చార్జిషీటు..
షిట్.. షిట్... బ్లడీషిట్ ..బుల్‌షిట్..
నరకం.. నరకం.. పోవాలి. పోవాలి... బైటికి పోవాలి.. పోవాలి..
ఆఫీసు గేటుదగ్గర ఎవడూ ఎవడూ..వాడెవడూ..ఎవడూ
బ్రూస్‌లీ కాదు... కాదు... కాబూలీ..
కాబూల్.. బెలుచిస్తాన్... ఆఫ్ఘనిస్తాన్..
తీర్చాలి... తీర్చాలి బాకీ తీర్చాతీర్చాలి..
యిస్తాను... ఇస్తాను... ఫస్టుకిస్తానిస్తాను..
చూస్తావ్... చూస్తావ్... నైతో కైమాసేసేస్తావ్... సేసేస్తావ్..
వస్తావ్..వస్తావ్..

నకరం...నకరం..
పోవాలి.. పోవాలి.. యింటికి పోవాలి.. పోవాలి...
యింటికా అమ్మో నరకం... నరకం... బాబోయ్ నరకం... నరకం.. కావాలి... కావాలి... స్వర్గం... కావాలి కావాలి సర్వం మరచే మైకం... కావాలి కావాలి.
ఒయాసిస్‌లో విస్కీ
బ్లూ హెవెన్‌లో బోసిమొలల బూతుసినిమా
ఓబ్రాయ్‌లో కేబ్రే
అబ్బో... అబ్బబ్బో... ఎన్నెన్ని స్వర్గం ముక్కలు..
అబ్బా... అబ్బబ్బా జేబుల్నిండా బొక్కలు, బొక్కలు.. పోవాలి పోవాలి.. ఏదో సాదాసీదా బ్రాందీ కొట్టుకే పోవాలి పోవాలి చీకటి సందులో రేకుల గూటిలో.. సిగరెట్ పీకల పొగలో.. కృత్రిమ మేఘాల్లో కృత్రిమ లోకాల్లో హాయిగా విహరిస్తూ యిహాన్ని విస్మరిస్తూ.. మందు మజాలో మెస్మరిజంలో మత్తుగా చిత్తుగా తాగి... తాగి... తూగి తూగి ఎస్కేపిజం... ఎస్కేపిజం. నవకలో బ్రాందీ ఉందా? కారు నవకలో బ్రాందీ వుందా.. ఉంటే యివ్వండి... యివ్వండి తొందరగా యివ్వండివ్వండి...
కేబరేలో బేర్‌గా ఉబికిన రొమ్ములుచూసి స్ఖలించకోయ్... స్ఖలించకు.. పేవ్‌మెంట్లపై పూరి గుడిసెల్లో ఎండిన డొక్కలు చూసిచలించవోయ్ చలించు..

ఎవడు వాడు ఎవడువాడు... ఎవడో కవిగాడు... వాడిదో కవిగోడు.. శోషిస్తు... పోషలిస్టు... మందిస్టు...
బావుంది... బావుంది... బ్రాందీ బావుంది.. బావుంది.. స్వర్గానికిదే షార్టుకట్టు..కట్..హాంఫట్... ఫట్..
టక్..ట్..టక్‌టక్..
ఎవరూ ఎవరూ ఎవరెవరూ..
పోలీసులు..పోలీసులు రైడింగు..రైడింగ్...
ప్రభుత్వసారాకొట్లో తాగితే పట్టించుకోని ప్రభుత్వం బ్రాందీ కొట్లో తాగితే పట్టుకుంటుంది. అక్కడ నేరంకానిది... ఇక్కడ ఘోరం. బ్యూరోక్రసీ వర్థిలు.. వర్థిలు... చంబల్‌లోయ బందిపోట్లలా పోలీసులు..తెరవండి...తెరవండి.. తలుపుల్తెరవండి...తెరవండి..
పట్టుకుంటే పట్టుబడితే జైలు.... జుల్మానా..

పోలీసుల లాటీపోట్లు... లోకుల సూటిపోట్లు.. ఈటెపోట్లు..
పరువు... పరువో.. అయితే పద.. పరుగు... పరుగు.. ఎస్కేప్..ఎస్కేప్...
చేతిలో సగం కాలీ అయిన గోల్కొండ..
వెంతనే సగం కూలిన గోడ...
గోడదాటితే చీకటి చీకటి అంతా చీకటి...
గెంతెయ్యాలి..గెంతెయ్యాలి.. ఒక్క గెంతులో ఒకే ఒక గెంతులో... గెంతేయ్యాలి.. గెంతి చీకట్లో కల్సిపోవాలి..
ఉ... కమాన్... హరియప్... క్విక్... జంప్...
అబ్బా.. అబ్బా.. అమ్మా..అమ్మా..
పగిలిన గోల్కొండ పగలదీసిన గుండె గుండెలో గోల్కొండ... ఏవిటేది... ఏవిటేది.. యిదేవిటేది...
పగిలిన గోల్కొండ లోంచి ఒలుకుతున్న ఎర్రని ద్రవం.. ఏమిటేది... ఏమిటేది... బ్రాందీ... బ్రాందీ.. గోల్కొండ బ్రాందీ... పగిలిన గోల్కొండను నింపుతూ అదేవిటది మరేవిటది!... రక్తం... రక్తం... చిక్కని మనిషి రక్తం..
కాలీ గోల్కొండ కాలీ అవుతూన్న గుండె...
ఊరి చివర స్మశానంలో దట్టంగా పేరుకున్న చీకట్లోంచి...

రొప్పుతూ రొజుతూ పరిగెడుతూ తను..
చుట్టూ అనంతంగా పరచుకున్న మైదానంలో..ఒంటరిగా..
అలసటగా పరిగెడుతూ తను....
తన వెనుక దూరంగా క్రూరంగా గోలచేస్తూ గేలిచేస్తూ తరుముకొస్తూ ఏదో గుంపు
నేలమీద నడిచినట్టు కాక, గాల్లో తేలుతూ వేగంగా దూసుకొస్తున్న ఏవో మానవాకారాలు.
ఎవరూ... వాళ్లెవరూ..
ఎంత పరిగెత్తినా తరగని మైదానం తగ్గని దూరం.. క్షణంలో హరించుకుపోతూ వాళ్ళలో ద్విగుణీకృతమవుతున్న శక్తి...
క్షణం క్షణం దగ్గరౌతూ తనను చుట్టుముట్టబోతున్న వాళ్ళు ఎవరు...
నోళ్ళ చివర మెరుస్తున్న కోరలు...
మెళ్ళో కపాలాల హారాలు

పాలిపోయిన మొహాలు..
పీచురేగిన జుట్టు..
ఎవరూ.. వాళ్ళెవరూ..
పిశాచాలా... ప్రేతాత్మలా...
అరె... ఆశ్చర్యం... ఆశ్చర్యం... అంతా తనవాళ్ళే... తనకు తెలిసినవాళ్ళే...
తల్లి... తండ్రి... పెళ్లాం.. పిల్లలు
రాక్షసిలా దూసుకొస్తున్న ఆర్టీసీ బస్సు మొబైల్ స్క్వాడ్ వికృతంగా నవ్వుతున్న ఆఫీసరుడు...
బలిసిన రొమ్ముల్ని ప్రిరల్ని నగ్నంగా చూపుతూ..వూపుతూ వూరిస్తున్న డైజీ
ముఖాన కాకిముక్కుల్తో చేతుల్లో ఈటెల్తో గెంతుకొస్తున్న కోలీగ్స్,కొరడా.. లాటీలు.. వూపుకొస్తున్న కాబూలీ ..పోలీసులు నో..నో.. వాళ్ళకు దొరక్కూడదు... వాళ్ళకు అందకూడదు. దొరక్కూడదు... అందకూడదు...
అందకూడదు..దొరక్కూడదు...
రనప్... రనప్.. ఎస్కేప్...ఎస్కేప్...
గోల్కొండ నిండింది.. గుండె ఖాళీ అయింది.

